# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

**పత్రికా ప్రకటన** **తేది: 08-10-2017**

ఎంతో కాలంగా పెండింగ్ లో ఉన్న పోలీసు అధికారుల పదోన్నతి అంశాన్ని ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు శనివారం పరిష్కరించారు. దాదాపు నాలుగు గంటల పాటు సుదీర్ఘంగా చర్చించి, న్యాయశాఖ అధికారులు, పోలీసు అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులతో అనేక దఫలుగా చర్చలు జరిపి ఒకే సారి ఏకంగా 275 మందికి నాన్ క్యాడర్ ఎస్పీలుగా, ఎఎస్పిలుగా, డిఎస్పీలుగా పదోన్నతులు కల్పించాలని నిర్ణయించారు. దీంతో 1994 బ్యాచ్ వరకు ప్రతీ పోలీసు అధికారికి పదోన్నతి లభిస్తుంది. దీనికి సంబంధించిన ఫైలుపై ముఖ్యమంత్రి శనివారం రాత్రి సంతకం చేశారు. పోలీసు అధికారుల పదోన్నతిపై ప్రగతి భవన్లో సీఎం కేసీఆర్ శనివారం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఉపముఖ్యమంత్రి శ్రీ కడియం శ్రీహరి, మంత్రులు శ్రీ పోచారం శ్రీనివాసరెడ్డి, శ్రీ తుమ్మల నాగేశ్వర్ రావు, శ్రీ ఈటెల రాజేందర్, శ్రీ ఇంద్ర కరణ్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన సలహాదారు శ్రీ రాజీవ్ శర్మ, చీఫ్ సెక్రటరీ శ్రీ ఎస్పి.సింగ్, డిజిపి శ్రీ అనురాగ్ శర్మ, అడ్వకేట్ జనరల్ శ్రీ ప్రకాశ్ రెడ్డి, న్యాయ శాఖ కార్యదర్శి శ్రీ నిరంజన్ రావు, సీఎంఒ అదికారులు శ్రీ నర్సింగ్ రావు, శ్రీ భూపాల్ రెడ్డి, హోం సెక్రటరీ శ్రీ రాజీవ్ త్రివేది, సిటి సిపి శ్రీ మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు శ్రీమతి కొండా సురేఖ, విప్ శ్రీ పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ శ్రీ కొండా మురళి, ఎమ్మెల్యే శ్రీ అజయ్ కుమార్, ప్రభుత్వ ప్రతినిధి శ్రీ వేణుగోపాలచారి తదితరులు పాల్గొన్నారు.

పోలీసు పదోన్నతుల విషయంలో తమకు అన్యాయం జరుగుతున్నదని చాలా మంది ప్రభుత్వానికి ఫిర్యాదులు చేశారు. కొందరు కోర్టుకు పోయారు. ముఖ్యమంత్రి నుంచి మంత్రుల దాకా పలువురికి వినతులు ఇచ్చారు. సమైక్య రాష్ట్రంలోనే పదోన్నతుల విషయంలో వివక్ష, గందరగోళం జరిగింది. ఈ సమస్యను పరిష్కరించి, పదోన్నతుల్లో పారదర్శకత పాటించాని సీఎం దృఢ నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలోనే శనివారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. అడ్వకేట్ జనరల్ అభిప్రాయం కూడా తీసుకుని వివాదాలకు తావులేని విధంగా సమస్యను పరిష్కరించారు.

రాష్ట్ర వ్యాప్తంగా 139 మంది సిఐలకు డిఎస్పీలుగా, 103 మంది డిఎస్పీలకు ఎఎస్పీలుగా, 33 మంది ఎఎస్పీలకు నాన్ క్యాడర్ ఎస్పీలుగా పదోన్నతి కల్పిస్తూ ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారు. 1994 బ్యాచ్

వరకు ఉన్న పదోన్నతి కోసం వేచి చూస్తున్న సిఐలందరికీ పదోన్నతి లభించనుంది. పదోన్నతులు కల్పించిన వారితో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని, అవసరమనుకుంటే సూపర్ న్యూమరీ పోస్టులు కల్పించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం ప్రకటించారు. అంతకుముందు పోలీసు అధికారుల పదోన్నతి అంశంపై విస్తృతంగా చర్చించారు.

"అర్హులైన వారందరికీ ఎలాంటి వివక్ష లేకుండా సకాలంలో పదోన్నతి లభించాలి. కానీ సమైక్య ఆంధ్రప్రదేశ్ లో అలాంటి న్యాయం జరగలేదు. వివక్ష చూపారు. దీనివల్ల కొంతమందికి అన్యాయం జరిగింది. జోన్ల వారీగా నియామకాలు జరిగినప్పటికీ రాష్ట్ర స్థాయి కేడర్ కు పదోన్నతి కల్పించే సందర్భంలో జోన్ల నిష్పత్తి పాటించాల్సిన అవసరం ఉంది. కానీ అలా జరగలేదు. గతంలో ఇన్స్పెక్టర్ స్థాయి నుండి డిఎస్పీ స్థాయి వరకు ప్రమోషన్లు ఇచ్చినప్పుడు జరిగిన తప్పొప్పులను సరిదిద్ది, ఎవరికీ అన్యాయం జరుగకుండా చూడాలి. అన్యాయాన్ని సరిదిద్దాడానికి అవసరమైనచోట సూపర్ న్యూమరి పోస్టులను ఏర్పాటు చేయాలి. ఇలా చేయటం వల్ల వరంగల్ జోన్ లో ఇన్ స్పెక్టర్లకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దవచ్చు" అని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. పోలీసు అధికారుల పదోన్నతుల్లో అన్యాయాలను సరిచేసి, అర్హులైన వారందరికీ ప్రమోషన్లు ఇచ్చినందుకు ఐదవ జోన్ కు చెందిన ప్రజా ప్రతినిధులు ముఖ్యమంత్రి కేసీఆర్ కృతజ్ఞతలు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, మంత్రి ఈటెల రాజేందర్, పోచారం శ్రీనివాస రెడ్డి, ఎంపి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, కొండా మురళి, కొండా సురేఖ, వేణుగోపాల చారి, పువ్వాడ అజయ్ కుమార్ తదితరులు సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన వారిలో ఉన్నారు.

**సిపిఆర్ఓ టు సిఎం**